నీదయవల్ల...నీకన్న దర్జాగా బతగడం నేర్చుకున్నాను.

ప్రేమపేరుచెప్పి ఏమీఎరగని అమాయికురాళ్ళ మానం దోచుకునే నీలాంటిదొంగలను చేతనైనంతవరకూ కసితీరా హింసించడానికి— నేనొక అగ్నిహోత్రాన్నయి—మగమిడతల్ని లాగగలిగినంతగా లాగి బూడిదచేసి మరీఆరిపోతాను" ఉన్మాత్తంగాలేచి ఊడిపోయిన జుట్టుముడి వేసుకుంటూ చంటి పిల్లను ఎత్తుగుంది. రంగబాబు చింతనిప్పుల్లాంటి కళ్లను తీవ్రంగా ఎత్తాడు "నోర్మూయ్—ముండా—లేచివచ్చిందానికి ఎంత పొగరూ? గుమ్మందాటితే నరికిపారేస్తాను." అనితూలుతూ లేచి ముందుకునడిచే ఆమెచేయిపట్టుకు వెనక్కు గుంజాడు. ఆమె అతన్ని గోడపైకి ఒక్కతోపుతోసి అడుపులిలా రెండు అంగల్లో వీధులోకి వచ్చిపడింది.

రంగబాబు విరిగేనిపాలోంచి తెరవలేని కళ్లను తెరవబోతూ "సిగతి...అంతే...చావు" అని నీరసంగా మూలిగాడు.

దౌర్జన్యం

"ఎక్కణ్ణించి—అమ్మాయీ?"

"...విజయనగరం"

"అంటే?"

"........"

"ప్రభాకరం బావా?"

"కాదు"

"జనార్దనం"

"ఊహుఁ"

"చిన్నమామయ్య గారేలు...ఏమంటాడు"

"ఏమీ అనడు"

కోపంవచ్చింది. "బొంకులు దిబ్బమీది ఎవడో 'కోక్ కిస్కా'—ఎవడైతే ఎవడికేం కావాలి? కాకపోయినా ఈచదువు కున్న ఆడపిల్లలికి మరీబచ్చింది. కాస్త పెద్దాపిన్నా—తారతమ్యం—బొత్తిగా నశించింది. వాళ్ళను అని, ఏంలాభం—ఈ కొరవితో తలగోక్కున్నాం. అనుభవిస్తున్నాం. బాగుందమ్మా—బాగుంది. దేశంలో ఆర్షవిద్య నశించగానే కట్టుబొట్లూ నశించాయి" సీతారామయ్యగారు వేదధర్మహాని కోసం ఒక్కసారి విలపించి తనమామూలు కోర్టు వ్యవహారపు కాగితాల్లో పడ్డారు. సరస్వతి అందుకుంది. "అన్నయ్యా, ఆదస్తా వేజు ఎప్పుడు ఎందుకురాసింది?"

"నీకు తెలియదు"

"ఐనా చెప్పిచూడు—"

"నాకు కోపం తెప్పించకు—నీధోరణి ముదిరిపోతోంది. నీకు ఈ మాలచదువు చెప్పించి నా కొంపమీదకు నేనే తెచ్చు కున్నాను."

"తలనున్నగా చేయించి, బిందెఇచ్చి నూతికి పంపక పోయావు—నీమతం—నాఆస్తి అన్నీ సురక్షితంగా నిలుచును."

"ఆపొరపాటుకే ఇప్పుడు విచారిస్తున్నాను."

"పొరపాటుచేతనైనా నువ్వు ఒక్కసత్కార్యం చేసినందుకు నేను పొంగిపోతున్నాను. మీదాక్షిణ్యాలు కొన్నైనా చూడడానికి నాకన్ను తెరిపించి పుణ్యంకట్టుకున్నావు. అదేపదివేలు"

"చాలించు పాండిత్యం"

"కదిపింది నువ్వు"

2

ఏమిటో తిక్కగాఉంది. సరస్వతి చరచర మేడమీదకు వెళ్ళి ఒక సోఫాలో చదికిలబడి కిటికీలోంచి దూరంగా కనబడే కొండలనూ, ఆకాశపునీలాన్ని చూస్తోంది. "ఈ చిన్నవిషయానికి అన్నయ్య ఎంత రగడపెంచాడు! నాకోస్నేహితుడు ఉత్తరంరాస్తే అది అతనికి చూపించాలట. తనఉత్తరాలు నాకు చూపిస్తున్నాడా? చెడిపోతానని భయమా? అంటే తనకు, తలవంపులు—ఫలానాయన చెల్లెలు...కులానికిమచ్చ. ఆ కులగౌరవం కాపాడేబాధ్యత నాకే ఒదిలిపెట్టకూడదూ? ఊహుఁ పనికిరాదు. ఆడది తప్పుచేస్తుంది. మగవాడు కాపాడాలి. ఇదీ వారిసిద్ధాంతం.

చిన్నన్నయ్య కలకత్తాలో స్వేచ్ఛగా ఒకబంగాలీ పిల్లను చేరదీసి దానికూడుతిని వస్తే అన్నయ్య కులమర్యాద చెడలేదు.

ఎందుచేత? అతను సాటిమగవాడు. ఫర్వాలేదు. నేను ఆడదాన్ని ఎప్పటికీ 'మైనార్టీ' తీరనిదాన్ని.

ఈచదువును తిడతాడు. పిచ్చివాడు. మహాప్రవాహంలా వచ్చిపడే ఈనాగరికతను కొత్తఊహల్ని ఏంచేస్తాడు? ఎన్నాళ్లు కన్ను కప్పగలడు? సనాతనమతాన్నీ వేదాన్నీ పొగుడు కుంటూ తిరిగి నవనాగరికతను, సిద్ధాంతాల్నీ తిడతారు. మళ్లా కొడుకులకు ఇంగ్లీషుచదువు తప్పదు. మొదటినుంచీ 'మిల్టన్' పేరు విన్నవాడు వాల్మీకిని ఎట్లాపొగుడుతాడు? లేదని తగాదా పెట్టే మూర్ఖులనుచూస్తే నవ్వొస్తుంది. వీళ్లను ఏడిపించడానికైనా తిరుగుబాటు తేవాలనిపిస్తుంది" చేతిలో కవను జారి టక్కున కిందపడడంలో ఆలోచనా ప్రవాహం అటుతిరిగింది.

ఈస్నేహం ఎంతచిత్రమైంది! కిందటివేసంకాలం సెలవుల్లో చిన్నమామయ్యకు జ్వరంగా ఉందనితెలిసి అమ్మా నేను, విజయనగరం వెళ్ళడమేమిటి? అప్రయత్నంగా ఈ 'జోసెఫ్' కనబడ్డం—మైత్రీ—ఏమిటి? తలచుకుంటే నాకే నవ్వువస్తుంది.

కన్నుమూసుగుంటే ఆదృశ్యం కళ్లలో తిరుగుతుంది.

చిన్న మామయ్యను విజయనగరం పెద్ద హాస్పిటల్‌లో చేర్చారు. సుమారు 15 రోజులనుంచి అతనుబాధపడుతున్నాడు. డాక్టర్లు ప్రమాదం తప్పిందన్నారు. అమ్మా, నేనూ ప్రభాకరం ఒకరువిడిస్తే ఒకరం మామయ్యను కనిపెట్టుకు ఉండేవాళ్లం. మామయ్యను చేర్చిన వారంరోజులకు ఒకకాలేజి విద్యార్థిని నలుగురు విద్యార్థులు తీసుకువచ్చి హాస్పిటల్లో చేర్చారు.

న్యుమోనియా జ్వరం అతనికి. రెండు ఊపిరితిత్తులూ చెడ్డాయి. మామయ్యగదిలోనే అతని 'బెడ్' కూడా. కాలేజివిద్యార్థులు చుట్టపు చూపుగా టిప్‌టాప్‌గా చూడడానికివచ్చి కాస్త కాలుమోపి తియ్యనిమాటలాడి చక్కాపోయేవారు పగలు. ఎట్లాగో గడిచేది.

రాత్రిబండరాయిలా కదిలేదికాదు. పాపం అతడుఒక్కడూ ఆక్రిష్ణయ్యను కనిపెట్టుకుని ఉండి అతని పెదవులకు లాలనగా మందు అందించి బట్టకప్పి గాభరాపడుతూంటే డాక్టర్లదగ్గరకు పరిగెత్తి—పాపం ఎంత బాధపడేవాడు!

ఒకొక్కరోజు, నేనొకర్తెనూ చాలసేపు మామయ్యను కనిపెట్టుకొనిఉండేదాన్ని. అతడొక్కడూ అతన్ని. కొంచెంక్రిష్ణయ్యకు నిద్రపడితే ఏఇంగ్లీషు నావెలో చదువుదామని తీసేవాడు. నాలుగుపుటలు చదివేసరికి అతడు మొర్రోమని ఏబాధతోనో, కదిల్తే ఇతడు పుస్తకం గిరవాటుపెట్టి అతనిదగ్గరగావెళ్లేవాడు.

ఒకసారి మామయ్యకు శోషవచ్చింది. అమ్మ పాలకోసం వెళ్లిరాలేదు. ఏమీతోచక కంగారుపడుతున్నాను. డాక్టరుతో చెబుదామని పరిగెత్తాను. కనిపించలేదు. తిరిగివచ్చాను.

జోసెఫ్, మామయ్యకు తమఫ్లాస్కులోని పాలునెమ్మదిగా తాగిస్తున్నాడు. ఎంతదయ! మానవత్వం! అతడు భగవంతుడులా కనపడ్డాడు.

"ఎంతపని చేశారు...క్రిష్ణయ్యగారికి కావలిస్తే..." ఆత్రంగా అన్నాను.

చిరునవ్వుతో "అమ్మగారు తెస్తారుగా" అంటూ వెళ్ళాను. "అమ్మ అప్పుడే రాదేమో" అన్నాను. "పరిగెత్తి కాఫీ హొటల్లోనుంచి తెస్తాను. ఆగుతుందా?" అన్నాడు.

అతని ఔదార్యానికి, స్నేహబుద్ధికి ముగ్ధురాలనై పోయాను. అతనిపొందిక—తెలివి, చూడగా నాకతనిమీద అపార గౌరవం కలిగింది.

రోజూ ఏవో కొత్తకొత్త పుస్తకాలు తెచ్చేవాడు ఇంగ్లీషు—తెలుగు పత్రికలు. చనువుగాతీసి చదివేదాన్ని. ఏవో తన ఆశలు భవిష్యత్తులు చెప్పేవాడు ఆవొచ్చీరాని తెనుగు పలుకు బడితో. ఇంగ్లీషులో పిడుగు. నిజానికి నన్నుచిత్రంగా ఆకర్షించాడు. క్రైస్తవుడని జ్ఞాపకంవచ్చినప్పుడల్లా మనస్సుకు వికారంగా ఉండేది.

మరినాలుగు రోజులుగడిచాయి. పాపంకృష్ణయ్య దక్కలేదు. జోసెఫ్ దొర్లిపడ్డాడు. అతని నల్లనికళ్ళవెంట ఏకధారగా ముత్యాలదండ తెగినట్టు రాలినకన్నీళ్ళు ఇప్పటికిమరపురావు.

అతడు తుదిగా వెళ్ళిపోతూ ఇక్కడ ఒకగొప్ప స్నేహితుణ్ణి పోగొట్టుకున్నాను. ఇంకోఉత్తమ స్నేహితుల్ని సంపాదించాను. మనజీవయాత్రలు ఎంతచిత్రమైనవి! అని నమస్కరించి చిరునామా తీసుకుని వెళ్ళిపోయాడు. పాపం మరిచిపోలేక ఈ 'క్రిష్మస్ గ్రీటింగ్స్' పంపాడు.

అన్నయ్య దీనికెంతరాద్ధాంతం చేశాడు! చూపిస్తేఏముంది? మూస్తే అంతా అనుమానమే. తెరచితే ఏమీలేదు. నీడ

తొక్కుకు భయపడేవాళ్ళను చూస్తే ఏడిపించబుద్ధి—పెద్ద లయినాది పిన్నలయినాది.

3

"హారీ!"

"ఓయ్"

"'అమృత్'లో ఏమిటీ?"

"విప్రనారాయణ"

"నారాయణ నారాయణ"

"పోనీ—'హనుమాన్'లో ఇల్లాలు"

"దానిల్లు బంగారంగానూ"

"కృష్ణాలో సక్కుబాయి"

"అక్కరలేదు"

"తెలుగుసినీమా అక్కర్లేదని చెప్పకూడదూ"

"ఒక్కమాటా? కావలిస్తే పదిమాట్లు చెబుతాను."

"అభిమానంలేకే మనజాతిఇలా కుంగిపోతోంది."

"అమ్మ విషమిస్తుంది అభిమానించి తాగు"

"స్టైమయిపోతోంది...'జయా'లో ఏమిట్రా!"

"విద్యాపతి"

"అమ్మనాయ్యో...బతికించావు..."

'షష్టుపో'కి రెడీ...వంటయిపోయింది."

"హారీ!"

"బాబోయ్ అన్నయ్యా." అని హరి నాలిక కరుచుకుని నక్కాడు.

"సరస్వతీ!"

"ఊఁ"

"ఎక్కడికేమిటి సన్నాహం?"

"సినీమాకి...మంచిఫిల్ము వొచ్చిందిట"

"మంచివి రానిదెప్పుడూ?"

"అడగ్గానే నువ్వు పంపిందెప్పుడు?"

"అమ్మా, వీటివల్ల పుణ్యమా పురుషార్థమా? అమ్మకు కాస్త భాగవతం చదివి వినిపించరాదూ"

"అన్నయ్యా ఇహాంకంటె పరంమీద నీకెక్కువ ఆసక్తి. నాకు వినోదాల మీదనుంచి బుద్ధి ఇంకా విరగలేదు. అమ్మకు నువ్వు వినిపించు"

"వాడికి పరీక్షలు...చదువుకోనివ్వవన్న మాట——"

"అస్తమానూ చదివితే అసలు మతిపోతుందని ఈరోజు 'సినీమావళి' సంపాదించి తెచ్చినవాడు వాడే"

"మీ యిష్టమొచ్చినట్టూ ఏడవండి"

"త...థా...స్తు"

4

"హరీ!"

"ఆఁ"

"రత్నావళి తెనిగింపు నాటకమైనా చదివావా?"

"లేదక్కా"

"అందులో దీనిలోలాగే మొట్టమొదట్నే అద్భుతమైన వసంతోత్సవంవచ్చి మన్ని పరవశుల్ని చేస్తుంది."

"ఛాయాదేవి ప్రేమనటన ఎంతచక్కగా ఉందో చూశావా?"

"అబ్బాయి—ఈ మాట చెవిలో మోగడంలేదూ? కవివెనకాల అనూరాధ వస్తాంటేరాజు అన్నది—కవికేసాధ్ కవితాభీఆయా"

"హిందీవాళ్ళు ఎంత శ్రద్ధచేస్తారక్కా—కళకోసం—"

"తెనుగువాళ్లూచేస్తారు—'పావలా' కోసం"

ఈ సంభాషణా వేగంలో ఒక మళుపు తిరిగారు. ఒక యువకుడు సందేహిస్తూ వీరిని సమీపించి అన్నాడు.

"అబ్బ వెతగ్గా వెతగ్గా ఇక్కడ కనపడ్డారు" సరస్వతి హఠాత్తుగా ఆగి చూచింది.

"ఇదిగో—'జోసెఫ్' ఎన్నాళ్లకు! రాజమండ్రివచ్చి ఎన్నాళ్లయింది? ఏదైనా ఉద్యోగం దొరికిందా? మీరు క్రిస్మస్‌కు పంపిన కవరు అందింది. థాంక్స్—"

"నిన్న వచ్చాను ఇక్కడికి—మీపేరేగాని మీ అన్నగారి పేరు తెలియదు. ప్రయత్నించాను కనిపెట్టలేకపోయాను. రేపు మళ్లా ప్రయాణం. ఏమీతోచక సినీమాకు వచ్చాను. ఈ విధంగా మిమ్మల్ని చూచాను చాలా సంతోషం"

“ఇతను మా తమ్ముడు. పేరు శ్రీహరిరావు స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు—తమ్ముడూ! ఈయన మన స్నేహితులు జోసెఫ్ బి. ఏ గారు. చాలా స్నేహపాత్రులు”

ఉభయులకూ పరిచయంచేసింది. జోసెఫ్ కొంతదూరం నడిచి తాను ఇంకోతోవంట వెళ్ళవలెనన్నాడు. శ్రీహరి గోదావరిగట్టున హాయిగా వెన్నెట్లో నడచి వెళ్ళుదామన్నాడు. బయలుదేరారు. గోదావరిగాలి రివ్వున విసురుతోంది. కొంత దూరం నడిచాక హరి “అక్కా! ఇక్కడ నా స్నేహితుడొకడున్నాడు. పుస్తకాలు రెండు తెచ్చుకువస్తాను నడుస్తూ ఉండు” అని పక్కవీధిలోకి తప్పుకున్నాడు. సరస్వతి జోసెఫ్‌తో ఏదో లోకాభిరామాయణం మాట్లాడుతోంది. అతడు మెల్లగా వింటూ ఆమెతో నడుస్తున్నాడు. ఎరిగున్న ఆడవాళ్లూ మగవాళ్లూ ఇద్దరు ముగ్గురు వింతగా చూచి వెళ్లారు. వారు గుర్తించలేదు.

తాను వెళ్లవలసిన సందుదగ్గర జోసెఫ్ ఆగి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించి వెళ్లాడు. సరస్వతి సస్నేహంగా సెలవు పుచ్చుకొని ఇంటికి బయలుదేరింది.

“ఎవరది?”

“నేను అన్నయ్యా!”

“గుమ్మంలో కాలుపెట్టడానికి వీలులేదు”

“ఎందుచేత”

“సిగ్గులేదూ?”

"కాలేజీలో చేరగానే పోయింది—నీదయవల్ల—లేకపోతే ప్రతిమొగ శుంఠదగ్గరా తలవంచుకోవలసి ఉండేది. ఈ ఇంగ్లీషు చదువు రక్షించింది"

"ఆ వెధవ...ఏడీ?"

"ఇంకో పునిస్త్రీ దగ్గిరికి వెళ్లాడు"

"తెలిసిందిలే"

"ఏమిటి?"

"నా వంశం గంగలో కలిపావు—నా పేరు బుగ్గిచేశావు. నన్ను గుడ్డి వెధవనిచేస్తున్నావు—ఇక నడువు—"

"అన్నయ్యా మతిపోయిందా?"

"తలవంపులు"

"కాదు. లేదు. చాలా పొరబడుతున్నావు. ఇంతవరకూ నేనెట్టి అప్రతిష్ఠ కలిగించేపనీ చెయ్యలేదు. అదినీ గౌరవంకోసం కాదు. నా వ్యక్తి గౌరవంకోసం. మన సాంఘికాచారాలకు కొన్నిటికి నేను విరుద్ధంగా నడిస్తే నడిచిఉండవచ్చు. కాని అంతరాత్మ శుద్ధిగా ఎవరికీ లొంగలేదు. నా మాట నమ్ము" నిశ్చలంగా అంది.

"ఆడదాన్ని ఎవడునమ్ముమన్నాడు?" కళ్లారాచూచిన వాళ్లు చెప్పారు. నా ఇంట్లో ఉండతగవు. నీఇష్టంబచ్చిన చోటికి వెళ్లు. కావలిస్తే—నీడబ్బు నీకు పారేస్తాను. మరి నా గుమ్మం ఎక్కకు—" సీతారామయ్యగారు లేచి నించున్నారు ఒక నిశ్చయంతో.

" ఈ భవనం కట్టిన ఆయన నీ ఒక్కడికే తండ్రిగాడు. నాకూ తండ్రే. కాని ఈ దరిద్ర హిందూధర్మం మగజాతికి కొమ్ములు తొడిగి ఆడజాతిని అణగదొక్కింది. ఔను ఈభవనంనీది. నీ తండ్రి కట్టాడు. నాకు హక్కులేదు. నేను వెళుతున్నాను. ఇంతవరకూ అంతశ్శుద్ధిగా నేనెట్టిపాపం చెయ్యలేదు. ఇంక మూర్ఖమైన నీ మతాన్ని—ఆచారాన్ని ధిక్కరించి కసి తీర్చుకోవడంకోసం ఒక క్రైస్తవ మిత్రుణ్ణి పెళ్లాడతాను.

తలుపు వేసుకో "

వెళ్లిపోయింది.

ఆశ్రమవాసి

మధుసూదనశర్మగారి 'నైమిశ' కుటీరం వూరికి మైలు దూరంలో వుంది.

ఊరిలోని శర్మగారి స్నేహితులైన వర్షీయాంసులూ—శిష్యప్రాయులైన నవయువకులూ మధ్యాహ్నం మూడు గంటలు—అప్రాంతానికి 'నైమిశం'లో చేరి అనేకవిషయాల మీద వేడివేడిచర్చలు సాగిస్తూ వుంటారు.

సాహిత్యం—సమాజం—కళ— వేదాన్తం ఒకటేమిటి సమస్తం ఆ చిన్నపెంకుటింటి పాలగచ్చుసావిడి తుంగచాపల మీద అలా అలా వికసించి గిరగిర తిరిగి ఎగిరిపోతుంటాయి.